బీజేపీ మైండ్ గేమ్ షురూ?!

- లోక్‌సభ ఎన్నికల వేళ కొత్త ఆపరేషన్!
- ఉగ్రవాదుల ఏరివేత తమ ఘనతగా కలరింగ్
- మసూద్, పన్నూన్, తంబా ఘటనలు బీజేపీ విజయాలుగా నెట్టింట్లో అనామక పోస్టులు
- సాక్ష్యాలూ, ఆధారాలు చూపకుండానే ప్రచారం
- ఓట్లు దండుకొనేందుకే అంటున్న బుద్ధిజీవులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల వేళ ఏదో ఒక అంశాన్ని ముందరేసుకోవడం, దాన్ని పెద్ద యెత్తున ప్రచారం చేసి ఓట్లు దండుకోవడం బీజేపీకి రివాజుగా మారింది. 2014లో నల్ల ధనం అంశం, 2019లో పుల్వామా ఘటనల ద్వారా లబ్ధి పొందిన కమలదళం ఇప్పుడు మళ్లీ అదే పంథాను అనుసరిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయోధ్య రామమందిర నిర్మాణం తమకు ఓట్లు తెచ్చిపెడుతుందని మొన్నటివరకూ కమలనాథులు అనుకొన్నారు. అయితే, ఆ విషయాన్ని ప్రజలు క్రమంగా మరిచిపోవడంతో బీజేపీ పరివారం ఇప్పుడు ఉగ్రవాదుల ఏరివేత అనే మరో కొత్త అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చినట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రకటనలతోనే బురిడీ

'దేశంలో శాంతికి భంగం కలిగిస్తే, మేము పాకిస్థాన్‌లోకి ప్రవేశించి మరీ ఉగ్రమూకలను మట్టుబెడతాం' అంటూ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గతవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే, ఉన్నట్టుండి ఆయన ఆ స్థాయిలో విరుచుకుపడటానికి కారణమేమిటా? అని పలువురికి సందేహాలు కలిగాయి. అంతే.. అటు రాజ్‌నాథ్ ప్రకటన వెలువడిందో లేదో.. ఇటు సోషల్ మీడియాలో అనామక ఖాతాల నుంచి పోస్టుల వెల్లువ మొదలైంది. గడిచిన మూడు, నాలుగు నెలల వ్యవధిలో హతమైన ఉగ్రవాదులను మట్టుబెట్టింది మోదీ సర్కారేనని, సీక్రెట్ ఆపరేషన్స్‌తో ఎంతో చాకచక్యంగా ఈ పనులను పూర్తిచేశారని ఆ పోస్టుల్లో ఊదరగొట్టారు.

సాక్ష్యాలూ, ఆధారాలు లేకుండానే

పార్లమెంట్‌పై దాడి, ముంబై పేలుళ్లు, పుల్వామా ఘటనల సూత్రధారి జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ చీఫ్ మసూద్ అజహర్ హతమైనట్టు గత జనవరిలో వార్తలు వెలువడ్డాయి. అయితే, ఆయన మరణాన్ని ఇప్పటివరకూ ఎవరూ ధ్రువీకరించలేదు. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం మరణించినట్టు కూడా పుకార్లు వచ్చాయి. అయితే ఇది తప్పని అగ్రరాజ్యాలు కొట్టిపారేశాయి. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్‌పై హత్యాయత్నం ఓ మిస్టరీగా ఉండిపోయింది. తాజాగా సరబ్‌జిత్ సింగ్ హంతకుడు, ఉగ్రవాది అమీర్ సర్ఫరాజ్ తంబా హతమైనట్టు వార్తలు గుప్పుమన్నాయి. కానీ, తంబా మరణించలేదని పాకిస్తాన్ పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు. పైన పేర్కొన్న ఏ ఒక్క ఉదంతంలోనూ నిజమేంటో? అబద్ధమేంటో? ఇప్పటివరకూ అధికారికంగా తెలియదు. ఈ ఉగ్రవాదులు హతమయ్యారో? లేదో? కూడా నిర్ధారణ కాలేదు. ఆయా దేశాలు కూడా వీటిపై నోరు మెదపట్లేదు. అయినప్పటికీ, ఇవన్నీ తమ ఘనతగానే కొందరు బీజేపీ సానుభూతిపరులు సోషల్ మీడియాలో పోస్టుల రూపంలో అసత్య ప్రచారాన్ని చేస్తున్నారు. ఆ ప్రచారానికి తగినట్టు సాక్ష్యాలూ, ఆధారాలను చూయిస్తున్నారా? అంటే అదీ లేదు. దీంతో ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే బీజేపీకి చెందిన కొందరు ఇలాంటి మైండ్ గేమ్స్‌కు దిగుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు, బుద్ధిజీవులు అభిప్రాయపడుతున్నారు.

దేశంలో మోదీ వేవ్ లేదు

చర్చనీయాంశమైన అమరావతి బీజేపీ అభ్యర్థి వ్యాఖ్యలు

నవనీత్ రాణా

అమరావతి, ఏప్రిల్ 17: 'దేశంలో మోదీ వేవ్ లేదు' అంటూ సినీ నటి, మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నవనీత్ రాణా చేసిన ట్టుగా పేర్కొంటున్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమరావతిలో సోమవారం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ 'గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా పోరాటం సాగించాలి. మధ్యాహ్నం 12 గంటల కల్లా ఓటు వేయించడానికి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించాల్సి ఉంటుంది. మోదీ వేవ్(హవా) ఉందనే భ్రమల్లో ఉండకండి. 2019లో కూడా మోదీ వేవ్ ఉంది. అయినప్పటికీ నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచాను' అని ఆమె పేర్కొన్నారు.

ఆమె వ్యాఖ్యలు నిజమే:ఎంవీఏ

కాగా, ఆమె చేసిన వ్యాఖ్యలను విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) సమర్థించింది. 'ఆమె నిజం చెప్పారు. ఓటర్ల వాస్తవిక అభిప్రాయాలను ఆమె ప్రతిబింబించారు' అని పేర్కొంది. కాగా, రాణా 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి ఎన్సీపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఆమె వ్యాఖ్యలు వీడియో వైరల్ కావడంతో దానిపై ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (యూబీటీ) మాట్లాడుతూ విజయంపై బీజేపీ వర్గాల్లో తీవ్ర భయాందోళన నెలకొందని పేర్కొన్నాయి. మహారాష్ట్రలోని 48 సీట్లను విపక్ష కూటమి గెల్చుకుంటుందని శివ సేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. 'మోదీ వేవ్ మాట మరచిపోండి. మోదీ తాను పోటీ చేస్తున్న స్థానంలో విజయం సాధిస్తారా లేదా అన్నది కూడా అనుమానమే' అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో బీజేపీ కేవలం 45 సీట్లు మాత్రమే నెగ్గుతుందంటూ తమ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ పార్టీ సొంత అభ్యర్థులే ఇప్పుడు ఈ నిజాన్ని గట్టిగా, స్పష్టంగా చెప్పారు అని తెలిపారు.

నా ప్రసంగాన్ని వక్రీకరించారు: రాణా

తన వ్యాఖ్యలు వైరల్ కావడంపై నవనీత్ రాణా బుధవారం వివరణ ఇచ్చారు. తన ప్రసంగాన్ని ఎడిట్ చేసి తప్పుడు అర్థం వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. 'ప్రజలకు మోదీ చేసిన అభివృద్ధి గురించి తెలుసు. దేశంలో మోదీ వేవ్ ఉండేది... ఉంది.. ఉంటుంది' అంటూ ఆమె గత, వర్తమాన, భవిష్యత్తు పరిస్థితులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము మోదీ చేసిన అభివృద్ధిని, చేసిన వాగ్దానాలను మాత్రమే చూపెట్టి ఓట్లు అడుగుతున్నామన్నారు.

మోదీ కంటే గొప్పోళ్లు ఉన్నారనుకునేవాళ్లు దేశ ద్రోహులు

లక్నో, ఏప్రిల్ 17: ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కంటే గొప్ప వ్యక్తులు లేరని, వారి కంటే గొప్ప వాళ్లు ఉన్నారని నమ్మేవారు దేశద్రోహులేనని బీజేపీ ఎంపీ మహేశ్ శర్మ పేర్కొన్నారు. నోయిడా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆయన మాట్లాడుతూ... మోదీని, యోగిని సొంతవారిగా భావించాలని, అలా భావించని వారు తమ తల్లిదండ్రులను కూడా తమవారిగా పరిగణించరని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు.

రాహుల్, ప్రియాంక అమూల్ బేబీలు

అసోం సీఎం హిమంత సెటైర్

గువహటి, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలైన రాహుల్‌గాంధీ, ప్రియాంకలను అమూల్ బేబీలంటూ వెటకారం చేశారు అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ. ప్రియాంక గాంధీ ఇటీవలే అసోంలో రోడ్ షో చేపట్టారు. దీనిపై స్పందించిన బిశ్వశర్మ అమూల్ బేబీలను చూసేందుకు జనమెందుకు వెళతారు? దానికన్నా కజిరంగా నేషనల్ పార్క్‌కు వెళ్లాలనుకుంటారని ఎద్దేవా చేశారు. గాంధీ కుటుంబాన్ని చూడటం వల్ల తమకేం ఒరగదని ప్రజలు భావిస్తున్నట్టు హిమంత బిశ్వశర్మ తెలిపారు.

జనాభా ప్రయోజనాలను భారత్ పొందడం లేదు

- భారత యువతది 'కోహ్లీ' మనస్తత్వం
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



వాషింగ్టన్, ఏప్రిల్ 17: అధిక జనాభా ద్వారా కలిగే ప్రయోజనాలను భారత్ అందిపుచ్చుకోవడం లేదని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోవడమే ఇందుకు కారణమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. ఇప్పటికైనా మానవ వనరులను మెరుగుపరచడం, వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో జరిగిన ఓ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతీయ ఆవిష్కర్తలు ఎందుకు సింగపూర్ లేదా సిలికాన్ వ్యాలీకి వెళ్తున్నారని అడిగిన ప్రశ్నకు రఘురామ్ రాజన్ బదులిస్తూ.. తాము ప్రపంచంలో ఎవరికీ తక్కువ కాదనే విరాట్ కోహ్లీ మనస్తత్వంతో భారతీయ యువత ఉందని, ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని వారనుకుంటున్నారని పేర్కొన్నారు. భారత్‌లోనే ఉండకుండా బయటకు వెళ్లేందుకు ఎవరు ఎందుకు మొగ్గు చూపుతున్నారో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఇలాంటి కొందరితో మాట్లాడినప్పుడు.. వారు ప్రపంచాన్ని మార్చాలని అనుకుంటున్నట్టు చెప్పారన్నారు. భారత్‌లో యువత సంతోషంగా నివసించలేకపోతున్నారని రాజన్ అన్నారు. దేశంలో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉందని, రైల్వేలో ప్యూన్ ఉద్యోగాలకు పీహెచ్‌డీ చేసినవారు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు.

కేంద్రంపై కార్పొరేట్ల నియంత్రణ

- బీజేపీ మ్యానిఫెస్టోను రైతులు నమ్మట్లేదు
- మోదీ సర్కార్‌పై రాకేశ్ టికాయిత్ ధ్వజం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కార్పొరేట్ శక్తుల నియంత్రణ పెరిగిందని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) నేత రాకేశ్ టికాయిత్ ఆరోపించారు. కార్పొరేట్ల ఆదేశాల మేరకు మోదీ సర్కార్ పనిచేస్తున్నదని, 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోను రైతులెవరూ నమ్మడం లేదని అన్నారు. కార్పొరేట్ల గ్యాంగ్ బీజేపీని కబ్జా చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. రాకేశ్ టికాయిత్ బుధవారం పీటీఐ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కేంద్ర సర్కార్ తీరుపై ధ్వజమెత్తారు. బీజేపీ మ్యానిఫెస్టోను తాము నమ్మడం లేదని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో పంటలకు కనీస మద్దతు ధరపై(ఎంఎస్పీ) స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అయితే పదేండ్లయినా ఆ హామీని అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజలను మోసగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేశామని అబద్ధాలు చెప్పుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2047 లక్ష్యాల గురించి ప్రధాని చెప్తుంటారని, వారు(బీజేపీ) చెప్పే ఉద్దేశాల్లో విజయం సాధిస్తే, 70 శాతం దేశం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతుందని, భూమే వాళ్ల తదుపరి లక్ష్యంగా మారుతుందని టికాయిత్ పేర్కొన్నారు. భూ హక్కులపై కూడా పోరాటం చేస్తామని తెలిపారు

తొలి దశ ప్రచారానికి తెర

రేపటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

బరిలో 8 మంది కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ: సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల్లో తొలి దశ ఎన్నికల ప్రచారానికి బుధవారం సాయంత్రంతో తెర పడింది. తొలి దశలో మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి 102 లోక్‌సభ స్థానాల్లో ఈ నెల 19 న పోలింగ్ జరుగనున్నది. తమిళనాడులోని 39 స్థానాలతో పాటు రాజస్థాన్‌కు చెందిన 12, యూపీలో 8, మధ్యప్రదేశ్‌లో 6, మహారాష్ట్ర, అసోం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో 5 చొప్పున బీహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3; అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయాలో 2 చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్ము కశ్మీర్, లక్ష ద్వీప్, పుదుచ్చేరిలలో ఒక్కో స్థానానికి ఎన్నిక జరగనున్నది.

భారత్ @144 కోట్లు

- యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ నివేదిక
- ప్రసవ సమయంలో తగ్గిన శిశు మరణాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ప్రస్తుతం భారత దేశ జనాభా ఎంతో తెలుసా? అక్షరాల 144 కోట్లు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో 0 నుండి 14 ఏండ్ల వయస్సులో ఉన్నవారు 24 శాతం మంది ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది. 2021లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లు. ప్రసవ సమయంలో శిశు మరణాలు సంఖ్య బాగా తగ్గినట్టు నివేదిక వెల్లడించింది. దేశ జనాభాలో 10 నుండి 19 ఏండ్ల మధ్యనున్న వారు 17 శాతం మంది ఉండగా.. 10 నుండి 24 ఏండ్ల మధ్య ఉన్న వారు 68 శాతం ఉన్నారు. ఇక సీనియర్ సిటిజన్లు 7 శాతం ఉన్నారు. పురుషుల ఆయుర్దాయం 71 సంవత్సరాలు కాగా..స్త్రీల ఆయుర్దాయం 74 సంవత్సరాలుగా తేలిందని యూఎన్ఎఫ్‌పీఏ తెలిపింది. 2006-2023 మధ్య కాలంలో భారత్‌లో బాల్య వివాహాలు 23 శాతమని నివేదిక తేల్చింది. పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 640 జిల్లాల్లో ప్రసవానంతర మరణాల నిష్పత్తి లక్ష జననాలకు 70 కంటే తక్కువగా నమోదైంది. 114 జిల్లాల్లో మాత్రం ఈ నిష్పత్తి 210 కంటే ఎక్కువగా ఉన్నది. దాదాపు సగం మంది దళిత మహిళలకు ప్రసవానంతరం సంరక్షణ అందటం లేదని చెప్పింది.

బీజేపీ విభాగంలా ఈసీ పనితీరు: ఆప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారత ఎన్నికల సంఘం(ఈసీ)పై ఆమ్‌ఆద్మీ పార్టీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఈసీ బీజేపీ విభాగంలా పనిచేస్తున్నదని విమర్శించింది. సోషల్ మీడియాలో బీజేపీ పెడుతున్న పోస్టులపై, హోర్డింగ్‌లపై ఆప్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ పార్టీ ప్రధాన జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మరోవైపు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని వైసీపీ, టీడీపీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిలకు చెందిన కొన్ని పోస్టులను తొలగించాలని మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌ను ఈసీ ఆదేశించిన సంగతిని కక్కర్ ప్రస్తావించారు. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ విభాగంలా మారిందనిపిస్తుందని ఆమె ఆరోపించారు.

మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

- మరికొందరు మృతి చెందినట్టు అనుమానం
- భారీగా ఆయుధాలు, సామగ్రి స్వాధీనం

మావోయిస్టు మృతదేహాన్ని తరలిస్తున్న జవాన్లు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 17: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ అడవుల్లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 29 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మృతుల్లో 15 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఘటనా స్థలం నుంచి పెద్ద సంఖ్యలో ఏకే-47లు, ఇన్‌సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 303 రైఫిళ్లు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు బస్తర్ రేంజ్‌లో జరిగిన అతిపెద్ద ఆపరేషన్ ఇదేనన్నారు. ఈ ఎదురు కాల్పుల్లో మరికొంత మంది తీవ్రంగా గాయపడి ఉండొచ్చని, కొందరు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

రైలు పట్టాలపై పంజాబ్ రైతుల ఆందోళన

చండీగఢ్, అంబాల, ఏప్రిల్ 17: హర్యానా పోలీసులు అరెస్ట్ చేసిన ముగ్గురు రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్‌లో అన్నదాతలు ఆందోళనకు దిగారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం పాటియాల జిల్లాలో పంజాబ్, హర్యానా సరిహద్దు సమీపంలో అంబాల-లుధియానా మార్గంలో రైలు పట్టాలపై బైఠాయించి నిరసనకు దిగారు. వీరి ఆందోళన కారణంగా సుమారు 30 రైళ్ల దారి మళ్లింపు, రద్దు, పాక్షిక రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. శ్రీరామనవమి రోజు రైతులు ఆందోళనకు దిగడంతో ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'చల్లని' చూపు ఎవరిపైనో?

- హోరాహోరీ పోరుకు ఉత్తరాఖండ్ సిద్ధం
- జాతీయ అంశాలపై అధికార బీజేపీ దృష్టి
- స్థానికాంశాలే కాంగ్రెస్ ప్రచారాస్త్రాలు



కరణ్ మహారా

సీఎం పుష్కర్ సింగ్

డెహ్రాడూన్, ఏప్రిల్ 17: హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా ఉన్నది. రాష్ట్రంలోని మొత్తం ఐదు స్థానాలకు తొలి దశలో భాగంగా ఈనెల 19న పోలింగ్ జరుగనున్నది. రాష్ట్రంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొన్నది. గత మూడు లోక్‌సభ ఎన్నికల సరళిని పరిశీలిస్తే.. రాష్ట్ర ఓటర్లు ఏదొక జాతీయ పార్టీ వైపు మొగ్గు చూపుతూ వచ్చారు. 2009లో కాంగ్రెస్ రాష్ట్రంలోని ఐదు స్థానాలను గెలుచుకోగా.. 2014, 19 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఓటర్లు ఐదు ఎంపీ సీట్లను గంపగుత్తగా బీజేపీకి అప్పగించారు. అయితే ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో గతానికి భిన్నంగా స్థానిక అంశాలు ఎన్నికల్లో ప్రభావితం చేసే పరిస్థితి నెలకొన్నది. అగ్నిపథ్‌పై యువతలో నెలకొన్న అసంతృప్తి, భద్రతపై మహిళల్లో నెలకొన్న ఆందోళన ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.

యువత, మహిళా ఓటర్లే కీలకం

'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ హయాంలో గొప్పగా అభివృద్ధి చేశామని సీఎం పుష్కర్ సింగ్ ధామి ఓవైపు చెప్పుకొంటున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా జాతీయ అంశాలే తమకు ఓట్లు తెచ్చి పెడుతాయని బీజేపీ భావిస్తున్నది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లు తీసుకొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఈ బిల్లును పాస్ చేయగా.. రాష్ట్రపతి మార్చిలో ఆమోదించారు. దీంతో దేశంలో యూసీసీ చట్టాన్ని చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. ఇదే సమయంలో అయోధ్య రామ మందిరం అంశం కూడా తమకు లాభిస్తుందని కమలం నేతలు ఆశిస్తున్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం రాష్ట్రంలోని కమలం పార్టీకి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రాష్ట్రం నుంచి సైన్యంలో గణనీయ సంఖ్యలో యువత చేరుతుంటారు. ఈ నేపథ్యంలో అగ్నిపథ్ స్కీమ్‌పై యువతలో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది. పథకాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో పెద్దయెత్తున ఆందోళనలు కూడా జరిగాయి. మరోవైపు రాష్ట్రంలో మహిళల భద్రతపైనా ఆందోళన నెలకొన్నది. అంకిత భండారీ అనే 19 ఏండ్ల యువతిని రిషికేశ్‌లోని రిసార్టులో బీజేపీ మాజీ నేత కుమారుడు హత్య చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. స్థానిక అంశాలను లేవనెత్తడం ద్వారా ఓటర్లను తనవైపు తిప్పుకోవడంపై కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి పెట్టింది. నిరుద్యోగం, వలసలు, సిల్క్యారా సొరంగం కూలిన ఘటన వంటి ప్రమాదాలను ప్రస్తావిస్తోంది.

ఇద్దరు మాజీ సీఎంలకు ఝలక్

ఐదు లోక్‌సభ స్థానాలకుగానూ రెండింటిలో బీజేపీ అభ్యర్థులను మార్చింది. ఇందులో గఢ్వాల్, హరిద్వార్ ఉన్నాయి. ఈ రెండు స్థానాల్లో ప్రస్తుతం ఎంపీలుగా ఉన్నవాళ్లు ఇద్దరూ రాష్ట్ర మాజీ సీఎంలే కావడం గమనార్హం. గఢ్వాల్ ఎంపీగా ఉన్న మాజీ సీఎం తిరాత్ సింగ్ రావత్, హరిద్వార్ ఎంపీ అయిన మరో మాజీ సీఎం రమేశ్ పోఖ్రియాల్ నిశాంత్‌లను ఎన్నికల రేసు నుంచి తప్పించడంపై రాష్ట్రంలో పెద్దయెత్తున రాజకీయ చర్చ నడిచింది.

అయోధ్య రాముడికి ఆదిత్య తిలకం

- వైభవంగా వేడుకలు.. పరవశించిన భక్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): శ్రీరామ నవమి సందర్భంగా అయోధ్య రామయ్యకు బుధవారం సూర్యతిలక ధారణ అంగరంగ వైభవంగా జరిగింది. గర్భగుడిలోని బాల రాముని నుదుటి పై సూర్య తిలకం అలంకరణ విజయవంతంగా జరిగింది. దీనిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులంతా ఆనందోత్సాహాలతో తిలకించి, పరవశించిపోయారు. నవమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ దేశాల భక్తులు అయోధ్యకు పోటెత్తారు.

కాంతిని మళ్లించి...తిలకం దిద్ది...

సూర్య వంశానికి చెందిన శ్రీరామునికి సూర్య కిరణాలతో తిలకం దిద్దడం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ప్రారంభమయింది. సూర్య కిరణాలు బాల రాముని నుదుటిపై పడటం సుమారు రెండున్నర నిమిషాలపాటు కొనసాగింది. సూర్య తిలకం మెకానిజాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూర్కీ; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంయుక్తంగా డిజైన్ చేశాయి. సూర్యుడి భ్రమణ కాలానికి అనుగుణంగా ఏటా శ్రీరామ నవమి రోజు

సూర్యుడి కిరణాలు నేరుగా బాల రాముడి విగ్రహంపై పడేలా శాస్త్రవేత్తలు కృషి చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు తొలిసారి శ్రీరాముడిపై సూర్య కిరణాలు బొట్టు పెట్టినట్లుగా పడగా, వేద మంత్రోచ్చారణలతో సూర్య తిలకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాలుష్యాన్ని గుర్తుంచుకొని ఓటేయండి

పర్యావరణ పరిరక్షణను మదించండి

ఓటర్లకు ప్రజా సంఘాల పిలుపు

న్యూఢిల్లీ : ఓటు వేసే ముందు గత కొన్నేండ్లలో మన దేశం పర్యావరణ పరిరక్షణలో చూపిన పనితీరును మదింపు చేయాలని దాదాపు 70 పర్యావరణ, ప్రజా సంఘాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఈ సంఘాలు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 'రాబోయే ఏండ్లలో పరిశుభ్రమైన గాలి, నీరు పొందడానికి యువతకు గల హక్కు గురించి ఆలోచించాలి. వాతావరణ మార్పులు భారత్‌ను వేధిస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి ముందు ఈ అంశాలతోపాటు గత కొన్నేండ్లలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయా? తగ్గాయా? వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కొనసాగుతున్నాయా? లేదా? ఉద్యోగాల సృష్టి జరిగిందా? ప్రజల హక్కుల పరిస్థితి ఏమిటి? అనే అంశాలను కూడా పరిశీలించాలి' అని ప్రకటన కోరింది.

నాలుగో దశకు నేడు నోటిఫికేషన్

96 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: నాలుగో దశ లోక్‌సభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ కానున్నది. ఈ దశలో 9 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 96 లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ జరుగనున్నది. ఏపీలో 25 సీట్లు, తెలంగాణలో 17 సీట్లు, యూపీలో 13, మహారాష్ట్రలో 11, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో 8 సీట్లు, బీహార్‌లో 5, జార్ఖండ్, ఒడిశాలలో 4 సీట్లు, జమ్మూ కశ్మీర్‌లోని ఒక్క సీటుకు నాలుగో దశలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 25 వరకు నామినేషన్లు దాఖలు చేయచ్చు.

అమేథీపై పార్టీ ఆదేశాలు పాటిస్తా

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

లక్నో: అమేథీ నుంచి పోటీ చేసే నిర్ణయాన్ని పార్టీకే వదిలేసినట్టు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు మీడియా అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ బదులిస్తూ.. 'మా పార్టీలో అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు పార్టీ ఎన్నికల కమిటీ తీసుకుంటుంది. దాని ఆదేశాలు ఏవైనా నేను పాటిస్తా' అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, బీజేపీ 150 సీట్లకే పరిమితం అవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

రామరాజ్యం అందిస్తాం: ఆప్

'ఆప్ కా రామరాజ్య' వెబ్‌సైట్ ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల ముంగిట అనూహ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఓటర్లను ఆకట్టుకునేందుకు 'ఆప్ కా రామరాజ్య' వెబ్‌సైట్‌ను బుధవారం ప్రారంభించింది. ఆప్ నేతలు సంజయ్ సింగ్, అతిషి, సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ రామరాజ్యం సాధిస్తామని, దాని సాకారం కోసం కేజ్రీవాల్ గత పదేండ్లలో అద్భుతమైన విజయాలు సాధించారని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు ఆజాద్ దూరం

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ చీఫ్ గులాం నబీ ఆజాద్ ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. బుధవారం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా, అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గం నుంచి పీడీపీ అభ్యర్థిగా మెహబూబా ముఫ్తీ, ఇండియా కూటమి అభ్యర్థిగా మియాన్ అల్తాఫ్ అహ్మద్ పోటీ చేస్తున్నారు.

సీఏ పరీక్షల అడ్మిట్ కార్డులు విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: దేశవ్యాప్తంగా మే నెలలో జరిగే చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) ఫైనల్, ఇంటర్మీడియెట్ పరీక్షల అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. htpps:// eservices. icai.org లో రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి మీ అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఈ పరీక్షలను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు కోరినప్పటికీ ఢిల్లీ హైకోర్టు అందుకు అంగీకరించలేదు.